
# సన్న్యాస జీవితానికి సాక్ష్యం



ఎందరో దేశవిదేశీయులు వారి ప్రసంగాన్ని వినాలనే ఆసక్తితో వచ్చేస్తే- ఎన్నో దేశ విదేశీయ కెమెరాలు ఆయన చిత్రాన్ని క్లిక్కు మనిపించాలని ఆయన్ని ప్రార్థిస్తే- గొంతుక్కూర్చుని- ఓ చేతిలో దండాన్నీ- నేలమీద పెట్టిన కమండలాన్నీ (చెంబునీ)-పక్కగా పెట్టుకుని తాను ధరించిన గోచీ కన్పిస్తుంటే- భుజాన ఓ ఉత్తరీయాన్ని వేసుకుని దాదాపు వెర్రివానిలా ఉన్న ఆ చిత్రాన్నే తీసుకొమ్మన్నట్టు పోజిచ్చినవారెవ్వరైనా ఉన్నారంటే వారు ఈ పరమాచార్యులవారే తప్ప మరెవరూ కారు.

ప్రతిపక్షంలోనైనవాళ్లైకూడా ఎప్పుడో ఒకప్పుడు ఓ క్షణంపాటు పొగిడి ఉన్నారేమోగాని, దేవుడూ దైవ ప్రచారకులూ అనగానే తీవ్ర వ్యతిరేకత చూపే నాటి మదరాసు ద్రవిడ మున్నేట్ర కజగంవారు రాజ్యమేలుతూ ఉన్నప్పుడు ఆ ముఖ్యమంత్రికూడా స్వామివారి ఊరేగింపు వస్తూంటే కారు దిగి పక్కగా నిలిచి తలొంచి నిలబడ్డారంటే ఆ గౌరవం కలిగినవారు పరమాచార్యులవారే తప్ప మరెవరూ కారు- కాలేరు.

సన్న్యాస ధర్మంలో ఉంటూ ఇటు ఫిజిక్స్ అటు కెమిస్ట్రీ మరోపక్క ఏవియేషన్, ఇంకోపక్క జియాలజీ ఇలా ఇన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రాలలో కూడా తీవ్ర పరిశోధనాత్మక జ్ఞానం కలిగిఉండడమే కాక,ఆ నేటి విజ్ఞానశాస్త్రాలని నాటి వేదమంత్రాలతో పోల్చి చూపిస్తూ వేదంలో దాగిన నేటి శాస్త్రాలని సప్రమాణంగా ఉదాహరణలతో కూడా చూపగల ధీమంతులు పరమాచార్యులవారే తప్ప మరెవరూ లేరు. నడిచే దేవుడనే కీర్తికలవారు వీరే తప్ప మరెవరూ కారు.

## విద్యాభ్యాస కాలంలో

ఆశ్చర్యకరమైన అంశమేమంటే స్వామివారి విద్యాభ్యాసం క్రిస్టియన్ మిషనరీ పాఠశాలలో జరిగింది. దాంతో బైబిలు గురించిన అవగాహన వారికి బాగా ఏర్పడింది. ఓ పక్క విభూతిరేఖలూ ప్రాచీన సంప్రదాయ వేషంతో కన్పిస్తూ వారి మతవిషయాలని ఎంతో శ్రద్ధగా వింటూంటే వాళ్ళెంతో ఆనందపడి వాళ్ళదైన కోణంలో ఓ ప్రశ్నవేస్తూ 'హిందూధర్మంలో ఏముంది? ఇటుకి రావచ్చుగా!' అన్నారుట.

స్వామివారు చిరునవ్వు నవ్వి- "పుట్టుకతో రాజపుత్రుడే అయినా నాటకంలో వేయవలసింది ఆవుల తోలుకునే పసులకాపరి వేషమైనప్పుడు భటులూ కిరీటాలూ, ఆభరణాలూ ఉండవుగా! వేషానికి తగిన ఆహార్యమే కదా ఉండాలి! నేను నాదైన వేషంలో ఉంటూ నేర్పుతున్న మీ చదువుని నేర్చుకుంటున్నాను విజ్ఞానంకోసం.అయితే నా మార్గం నాదే!" అని నిర్ద్వంద్వంగా సధైర్యంగా చెప్పారట... అంతే? మరెవరూ మాట్లాడలేకపోయారుట!

ప్రహ్లాదుడు కూడా భాగవతంలో తన గురువుల సమక్షంలో తండ్రియైన హిరణ్యకశిపునితో ఇలాగే చెప్పాడు- గురువుల్లో ఏ దోషమూ లేదు. చెప్పబడేది రాక్షసవిద్య కాబట్టి వ్యతిరేకించకుండా నేర్చుకున్నాను. నాదైన చదువంటూ శ్రీహరి ధ్యానముంది కదా! అదే నా చదువు" అని.ఎప్పుడూ తన స్వభావాన్ని కోల్పోకూడదనేది వారి స్థిరాభిప్రాయం.నిజమే కదా!

## గురుపూజ

వీరి చిన్నతనంలో జరిగిన సంఘటనట ఇది.గురుపూజ అనగానే సాధారణంగా మనం గురువుగారికి శిష్యులో వారి అభిమానులో చేసే పూజ అని అనుకుంటాం. ఇక్కడి గురుపూజకి అర్థం అది కాదు. గురువు తన శిష్యునికి చేసిన పూజగా చెప్పుకోవాలి.

ఎందుకంటే గురువుగా వీరికి చదువుని నేర్పదలిచి వచ్చిన మహోన్నత పండితుడొచ్చి, వీరి జాతకాన్ని పరిశీలిస్తూనే ఒక పళ్ళాన్నీ చెంబుతో నీళ్ళని తేవలసిందని కోరారట వీరి తల్లిని. ఆమె ఏం జరగబోతోందో తెలియక అలాగే తెచ్చింది.

మరుక్షణంలో ఆ గురువుగారు వీరి పాదాలని పళ్ళెంలో ఉంచేలా చేసి పాదాలని కడిగి శిరసున చల్లుకుంటూ- ఈ నీ పిల్లవాడు మహాపూజ్యుడు కాగలుగుతాడు. ఉత్తమ కీర్తి ప్రతిష్ఠల్ని తన ప్రతిభా జ్ఞానాల కారణంగా పొందుతాడు. ఉత్తమ గర్భమమ్మా నీది! అని మురిసిపోయాడుట.

## తేలికగా వివరించడం

ఎంతో కష్టంగా తెలుసుకోదగిన విశేషాన్ని మరింత తేలికగా వివరించడం, అయితే ఆ వివరించే విశేషానికి గట్టి ప్రమాణాన్ని సూచిస్తూ మరీ చెప్పడమనేది స్వాములవారి సొత్తు. అందుకే ఈ ఆ మతాలనే భేదం లేకుండా అందరూ వారి ప్రసంగాలకి విచ్చేస్తూండేవారు. సూర్యుడూ, భూమీ అనే రెంటికీ ఉన్న సంబంధాన్ని గురించి వివరించవలసిందని ఎవరో శాస్త్రజ్ఞులడిగితే వారుచెప్పారు-సంస్కృతంలో ఏదైనా ఓ విషయాన్ని వివరించాలంటే 'న్యాయం' (పోలిక



**8.1.2024న శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పరమాచార్యులు**
**శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వాములవారి జయంతి సందర్భంగా.**

అనుకోవచ్చు) అనే ఓ పద్ధతిని ఆశ్రయిస్తారు.

ఉదాహరణకి మర్కట కిశోర న్యాయం-మార్జాల కిశోర న్యాయం...ఇలా. ఒక పిల్లి తన పిల్లని తీసుకుపోవాలంటే అది, తన పిల్ల మెడవెనుక ఉన్న మందమైన శరీరాన్ని తన పదునైన పళ్ళతో పట్టుకుని అంత బరువైన తన పిల్లినీ పడిపోకుండా రక్షించుకుంటూ గోడలెక్కడం, వేలమీద పరుగెత్తడం, కొద్ది దూరం పాటు గెంతడం... ఇలా చేస్తూ వెళ్ళిపోతుంది.

ఇక్కడ భారమంతా తల్లిపిల్లిదేగాని పిల్లిపిల్లదికాదు. దీన్ని మార్జాలకిశోరన్యాయమంటారు. చిన్నప్పుడు శిష్యుడు తప్పుచేస్తే ఆ తప్పు శిష్యునిదికాదు.'ఆచార్య మాగచ్ఛతి శిష్యదోషః'-ఆ గురువుకంత బుద్ధిలేదా? సరిగా పిల్లల్నిచూసుకోద్దా? అనేస్తారందరూ.పైతరగతులకి పిల్లవాడొచ్చాక, ఒక తీరు అవగాహనంటూ కలిగాక ఉండేది 'మర్కట కిశోరన్యాయం'.

కోతి ఎక్కడికైనా తన సంతానాన్ని పట్టుకువెళ్ళాలంటే ఆ కోతిపిల్ల తన రెండు కాళ్ళతో తన రెండు చేతులతో తన తల్లి పొట్టని గట్టిగా పట్టుకుంటుంది. తల్లి ఎంత వేగంగా పరుగెత్తినా చెట్లెక్కినా దిగినా దూకినా పడిపోకుండా తనని తాను రక్షించుకోవలసిన బాధ్యత పిల్లదే ఇక్కడ.

పై న్యాయానికీ దీనికీభేదాన్ని గమనించాం కదా! ఇదుగో ఈ చెప్పడాన్నే 'న్యాయ'మంటారు శాస్త్ర పరిభాషలో. భూమి సూర్యుని చుట్టూ తిరగడాన్ని (11వ శతాబ్దివరకూ) ఒకప్పటి కాలంలో ఎందరో ఒప్పుకోలేదు. సూర్యుడే పరిభ్రమిస్తూ ఉండడంబట్టి ఉదయం అస్తమానం జరుగుతున్నాయని భ్రమిస్తూండేవారు. అప్పుడు ఆర్యభటుడు 'లాఘవ గౌరవ న్యాయం' అనేదాన్ని ఉటంకిస్తూ భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోందని నిరూపించాడు.

## లాఘవ గౌరవ న్యాయం

లఘువు అంటే బరువులో తేలికగా ఉండేది అని అర్థం. గౌరవమంటే బరువులో మరింతగా ఉండేది అని అర్థం. లాఘవ గౌరవ న్యాయమంటే ఏది తేలికైనదో అది బరువైనదానికంటే తేలికైనది కాబట్టి, తేలికైనది బరువైనదాని చుట్టూ తిరుగుతూ ఉంటుందని దానర్థం.ఆ కారణంగానే గురువుగారంత చదువుకోని శిష్యుడు ఎంతో చదువుకున్న తన గురువుకి ప్రదక్షిణని గౌరవపూర్వకంగా చేస్తాడు కదా! 'గౌరవపూర్వకంగా' అనే మాటలో ఉన్న గురుపదానికున్న అర్థం ఇదే కదా! ఓ వినాయకుడు తనకి గణాధ్యక్ష పదవి రావడంకోసం తల్లిదండ్రులకి ప్రదక్షిణంచేశాడని మనం పురాణంలో విన్నా, మనందరం దేవాలయానికి ప్రదక్షిణలని చేస్తున్నామన్నా కారణం ఆ గౌరవం (మనకంటే గొప్పది) అనే భావంతోనే కదా?

ఇదే తీరు భావనచేస్తూ సూర్యుడూ, భూమీ అనే వాటినిగురించి ఆలోచిస్తే అన్నిటికంటే ఎంతో బరువైనదీ, తనకి ఏ ఇంధనమూ (నిప్పుని మండించేందుకు కావలసిన పదార్థం) లేకున్నా నిరంతరం మండుతూనే ఉండేదీ, ఎవరి కంటి చేతనూ ఎక్కువసేపు చూసే వీల్లేకుండా మాడుకోగల శక్తి ఉన్నదీ, తనవేడిమిద్వారా చంద్రునికి ప్రకాశాన్నిచ్చేదీ, మంచుని కరిగించేసి నదుల్ని మనకి అందించేదీ...

ఇలా ఎన్నో శక్తులున్నది సూర్యబింబం.

ఆ దృష్టిలో పోల్చి చూస్తే భూమి చిన్నది. ఆ కారణంగా ఎంతో చిన్నదైన (లఘువు) భూమి ఆ సూర్యుని చుట్టూ తిరుగుతుందని చెప్పాడు ఆర్యభట్టు- అంటూ ఆ విశేషాన్ని వివరించారు శాస్త్రజ్ఞుల సభలో స్వామివారు. ఇంతే కాదు. భూమికి ఆకర్షణ శక్తిఉందనే వరాహమిహిరుడు చెప్పిన విశేషాన్నిగురించి వివరిస్తూ కూడా శాస్త్రజ్ఞులకి ఆనందమయ్యేలా చేశారు ఆ సభలో స్వామివారు.

## అద్భుత పరిష్కారం

ఎవరైనా ఏదైనా అడిగితే వారిచ్చే పరిష్కారం చిత్రంగా ఉండేది. ఎంతో వెనుకకాలంలో వారు గుంటూరు జిల్లాలోని మూల్పూరు అనే గ్రామానికి వచ్చారు. గ్రామస్థులంతా వచ్చి "స్వామీ!మా ఊళ్ళో ఆలయం లేక చాలా ఇబ్బందిగా ఉంది. ధనవంతులున్నారు. ఆలయానికి స్థలం ఉంది. ఆలయాన్ని కడితే నిర్వహించుకోగల శక్తీ ఆస్తిక బుద్ధీ పాపభీతీ అన్నీ ఉన్నాయి. అయితే ఆలయం ముడిపడడలే"దన్నారు. ఆయన ఓ క్షణం ఆ స్థలాన్ని అలా చూసి- రేపటి నుండీ రోజూ ఈ స్థలంలో భజనచెయ్యండి ఓ గంట పాటు- అన్నారు. గ్రామస్థులకి పాలుపోలేదు ఆ పరిష్కారమార్గంలో ఏ అంతరార్థముందో!

అయినా పెద్దవారు చెప్పారుగదాని ప్రారంభించారు భజనని. అంతే! మూడునెలల్లో ఆలయం ప్రారంభమైంది. చక్కగా ప్రతిష్ఠ జరిగింది. దానికి కారణం కేవలం ఆ స్థలంలో వ్యాపించిన భజనధ్వని తరంగశక్తి మాత్రమే. ఇది విజ్ఞానశాస్త్రానికి అందని అతీంద్రియశక్తి విజ్ఞానం మాత్రమే. ఇలాటి ఎన్నిటినో స్వాములవారు చూపి ఉన్నారు.

## నిలువెత్తు సాక్ష్యం వీరే

పోతన తన భాగవతంలో శుకుడు పరీక్షిత్తుకి బోధించిన సన్న్యాస ధర్మాన్ని చెప్పాడు.

నిజమైన సన్న్యాసి నేలపడకని చేయాలి పరుపుల మీద కాదు. కరకు నారబట్టని వాడాలి తప్ప పట్టుదోవతులు కాదు.వండబడని పదార్థాలని తినాలి- రుచికర పదార్థాలని వెండి బంగారు పాత్రల్లో కాక అరచేతిని పాత్రగా వాడాలి-పెద్ద ప్రాసాదాల్లోకాకుండా విశేషించి ధనంతో అహంకారంతో ఉన్నవారింట కాకుండా ఉండాలి. ఇలా చెప్పాడు. స్వాములవారు ఈ తీరు సన్న్యాస ధర్మంలకి నిలువెత్తు సాక్షిగా నిలిచారు.

డా॥ మైలవరపు శ్రీనివాసరావు